# తాడు సాగదీస్తే ...

శృతికి అసహనంగా ఉంది. పది నిమిషాలకొకసారి 22 నెంబరు బస్సు, అరగంట సేపైనా అయిపు సయిపు లేనందుకు కోపంగా ఉంది.

మండుటెండలో చిరుజల్లులా.....

'ఏమండీ 22వ నెంబరు బస్సు వెళ్ళిందాండి?'

సులోచనారాణి నవల్లోని హీరోలా ఉన్న అతని పలకరింపు! ఒళ్ళు జలదరించింది. ఎన్నో రోజులుగా తన మనసులో అణిగి వున్న కోరిక తీరడంతో మనసు పులకించింది.

'నేనూ అదే బస్సు కొరకు అరగంట నుండి వెయిట్ చేస్తున్నానండీ. ఎప్పుడొస్తుందో ఏమో?'

పవన్ ప్రాణం కుదుట పడింది. తను లేటైనా, బస్సు మిస్సవనందుకు సంతోషం కల్గింది. రోజూ బస్సు క్యూలో, బస్సులో, చూసే అమ్మాయిని మొదటిసారిగా పలకరించగల్గినందుకు తన్ను తానే అభినందించుకున్నాడు పవన్.

ఆ అమ్మాయి కూడా మొహం చిట్లించుకోకుండా సవ్యంగా జవాబు చెప్పినందుకు మనసు పులకాంకితమైంది. ఆశ చిగురించింది.

ఇక చెప్పేదేముంది?

శృతి-పవన్ బాతాఖానీ లోకి దిగిపోయారు. ఆ రోజు ఆ తర్వాత రోజులూ 22వ నెంబరు బస్సు ఎంత లేటైనా పట్టించుకోని ఒక అలౌకిక స్థితికి చేరిపోయారు.

* * *

'ఓ కరెంట్ ఎకౌంట్ ఓపెన్ చేయాలండీ'

"మేనేజర్ గారిని కలవండి"

"నమస్కారం సార్!"

"నమస్కారం. కూచోండి"

"నేను మీ బ్యాంకులో కరెంట్ ఎకౌంట్ తెరవాలనుకుంటున్నాను"

"మీరేం బిజినెస్ చేస్తున్నారు?"

"కంప్యూటర్ స్టేషనరీ. జనరల్ స్టోర్ ఓపెన్ చేస్తున్నానండీ"

"ఎక్కడ మీ షాపు?"

"మీ బ్యాంకు పక్క సందులోనే మా మేడ ఉంది. క్రింద షాపు పైన ఇల్లు" చెప్పాడు సదానందం.

"ఈ వ్యాపారంలో మీకేమైనా అనుభవముందా మా బ్యాంకి నుంచి లోనేమైనా కావాలా?" మేనేజర్ అడిగాడు.

"ప్రస్తుతానికి లోనేమీ అక్కరలేదండీ. ఆర్నెల్లు. సిటీలోని మా బాబాయి ఆఫీసులో పని చేశాను. ఆయన స్టేషనరీ హోల్‌సేల్ డీలరు. డిగ్రీ చేసి రెండేళ్ళయింది. ఉద్యోగం వచ్చే సూచనలు కనిపించడం లేదు. మా బాబాయి ప్రోత్సాహంతో ఆయన అండతోనే ఈ వ్యాపారం మొదలుపెట్టాను."

"మీ ఎకౌంట్ ఎవరు ఇంట్రడ్యూస్ చేస్తారు?"

"గత అయిదేళ్ళ నుంచి నా సేవింగ్స్. ఎకౌంట్ మీ బ్యాంకులోనే ఉంది. అది చాలదా?" సదానందం.

'కరెంట్ ఖాతా తెరవడానికి మా ఖాతాదార్ల, అదీ కరెంట్ ఖాతాదార్ల పరిచయమే కావాలి' బ్రాంచి మానేజరు స్పష్టం చేశాడు.

"సరే ఫారం ఇవ్వండి - నేనెలాగో మానేజ్ చేస్తాను."

ఫారం తీసుకుని సదానందం 'ఫ్యూచురా కంప్యూటర్ స్టేషనరీ' పేర ఖాతా తెరిచాడు. ఆ తర్వాత షాపు కూడా తెరిచాడు. బ్యాంకులో అతని లావాదేవీలు మొదలయ్యాయి.

★ ★ ★

"నటరాజ్‌లో 'దిల్‌తో పాగల్ హై' చూద్దామా" పవన్ అడిగాడు, 'బస్‌స్టాప్ బాతాఖానీతో ఎన్ని రోజులు సరిపెట్టుకోవడం?' అని మనసులో అనుకుంటూ

"లేదండీ 'టైటానిక్' చూడాలనుంది." శృతి తన ఇష్టం తెలిపింది.

మీరు ఇంకా చూడలేదా? నేనెప్పుడో మా కొలీగ్సుతో కలిసి వెళ్ళాను. మీ కంపెనీ ఉంటే మళ్ళీ చూడడానికి నాకే అభ్యంతరమూ లేదు. పవన్ చాన్స్ వదలి పెట్టదలచలేదు. సినిమా ఎవరు చూడబోయారు?' అని మనసులో అనుకుంటూ.

"సరే వచ్చే ఆదివారం సెకండ్‌షోకి టిక్కెట్లు బుక్ చేయించండి" శృతి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

పవన్ మనస్సు పవనం కంటే వేగంగా పయనించి శృతితో కలిసి సినిమా చూస్తూ శృతిలయంతో నాట్యం చేసింది. ఏమేమో చేసింది. ఆ థ్రిల్ లోంచి తేరుకొవడానికి చాలా టైమ్ పట్టింది పవన్‌కు.

★ ★ ★

'ఫ్యూచురా కంప్యూటర్ స్టేషనరీ' వ్యాపారం బాగాపుంజుకుంది. నెలసరి లావాదేవీలు లక్షలకు చేరాయి. బ్యాంకు ఖాతాలో దాదాపు లక్ష రూపాయల దాకా నిలువ వుంటోంది. బ్రాంచి మేనేజరు, సదానందం మంచి మిత్రులయ్యారు. క్లియర్ కాని చెక్కుల డబ్బులు డ్రా చేసుకోనివ్వడం, డి.డీ. కమిషన్లలో రాయితీలు - ఇలా బ్యాంకు విలువైన ఖాతాదార్ల కిచ్చే అన్ని సౌకర్యాలు 'ఫ్యూచురా కంప్యూటర్ స్టేషనరీ' ఖాతాకు లభిస్తున్నాయి. పండగ సందర్భాల్లో బ్యాంకు స్టాఫుకు చిన్న చిన్న బహుమతులివ్వడం, బ్రాంచి మానేజరుకు ఏ.సి.హోటల్లో పార్టీ లివ్వడం - ఇలా చేసి బ్యాంకులో మంచి పరపతి సంపాదించాడు సదానందం.

★ ★ ★

పవన్ – శృతుల కలయిక, బస్సు స్టాపు నుంచి సినిమాలకు, పార్కులకు, షాపింగ్ సెంటర్‌లకు ఎదిగింది. చిరు బహుమతులతో మొదలై ఖరీదైన బంగారు ఆభరణాల వరకు పవన్ నుండి శృతికి లభించాయి. శృతి కూడా తన జీతం రాగానే జీన్సు, టైలు, షర్టులు పవన్‌కు ఇవ్వసాగింది. ఓ రోజు పార్కులో....

"ఎన్నాళ్ళిలా ఊరిస్తావు?" గారం పోయాడు పవన్.

"ఏమిటీ నేనూరించేది?"

"నేను నోరు తెరచి చెప్పాలా"

"ఆడదాన్నైన నాతోనే చెప్పించాలని చూస్తున్నావా?

"మన పెళ్ళికి మీ వాళ్ళొప్పుకుంటారంటావా?"

పవన్ డైరెక్టుగా విషయంలోకి వచ్చేశాడు.

"అడిగితే తెలుస్తుంది. మరి మీ వాళ్ళ మాటేమిటి?" శృతి కూడా తక్కువ తినలేదు.

"మా వాళ్ళతో చూచాయగా కదిపాను. పెద్ద అభ్యంతరం ఉండేట్లు లేదు. మాట్లాడడానికి మీ ఇంటికి ఎప్పుడు వచ్చేది?" పవన్ తొందర పవన్‌ది.

మా ఇంట్లో నా మాట కాదనరు. మా నాన్న నడిగి మీరెప్పుడు రావాలో రేపు శనివారం మనం కలిసినప్పుడు చెబుతాను"

"శనివారం నీ రాకకై వేయి కన్నులతో ఎదురు చూస్తాను."

★ ★ ★

'దిల్‌ఖుష్' హోటల్ బార్ రూం.

బ్యాంక్ బ్రాంచి మానేజరు, సదానందం ఓ మూల సీట్లో కూర్చుని మందు మంతనాలు చేస్తున్నారు. రెండో రౌండ్ నడుస్తోంది.

" ఈ మధ్య కంప్యూటర్ వాడకం చాలా పెరిగిపోయిందండీ. దాంతో మా స్టేషనరీకి కూడా విపరీతమైన డిమాండ్ వచ్చింది. కాని కాంపిటీషను కూడా పెరగటంతో ధరలు తగ్గించి అమ్మాల్సి వస్తోంది. టర్నోవరు పెరిగినా లాభాలు తగ్గాయి."

"మా బంధువు ఒకాయన కంప్యూటరు ఇంజనీయరు. కంప్యూటర్ల తయారీలో మంచి అనుభవముంది. కంప్యూటర్ ఎసెంబ్లీలో మంచి లాభాలుంటాయని ఓ కంప్యూటర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ పెడదామని ప్రతిపాదించాడు".

"ఇక ఆలోచించేదేముంది? మొదలు పెట్టండి".

మందు పని చేస్తోంది. బ్యాంకు మేనేజరుకు హుషారొచ్చింది.

"అది ఎక్కువ పెట్టుబడితో కూడుకున్న వ్యవహారం. దానికి మీ సహకారం కావాలి. మీరు లోనిస్తానంటేనే నేను అందులోకి దిగుతాను. అంత పెట్టుబడి నా ఒక్కనితో కాదు" సదానందం ముగ్గు మొదలు పెట్టాడు.

"మీ లాంటి వాళ్ళకి లోను ఇవ్వడానికి కాకపోతే మా బ్యాంకు లెందుకున్నాయి చెప్పండి? మీ ప్రాజెక్ట్ రిపోర్టు ఇవ్వండి మా రీజనల్ ఆఫీస్‌కి తప్పకుండా రికమండ్

చేస్తాను." బ్రాంచి మేనేజరు ముగ్గులోకి దిగాడు.

★ ★ ★

"మనమెంత అదృష్టవంతులం శ్రూ ! ఏమాత్రం రాద్ధాంతం లేకుండా ఆటంకం రాకుండా మన ప్రేమ ఫలవంతమవడం కలలోలా లేదూ?"

"అవును పా! నాకూ ఇది నమ్మశక్యంగా లేదు. ఇదంతా నా అదృష్టమనుకుంటున్నాను"

"నీ ఒక్కదాని అదృష్టమేనేమిటి? మనిద్దరి అదృష్టం. పెళ్ళి రోజు ఎప్పుడా అని ఎదురుచూస్తున్నాను. మన ప్రేమ పరాకాష్ట చేరడానికి ఉవ్విళ్ళూరుతున్నాను."

"నేనూ అంతే పా! అవునూ, హనీమూన్‌కి ఊటీవెళదామా".

"ఛ ఛ సగటు వాళ్ళలా ఊటీ ఏమిటీ, కులూ, మనాలీ వెళదాం. వస్తూ సిమ్లా, కూడా చూద్దాం. కాశ్మీరు గొడవల్లో ఉంది లేకపోతే దాల్‌లేక్ లోని హౌస్‌బోటులో మకాం వేసేద్దును. నా ఎల్.టి.సి. మన హనీమూన్‌కై దాచి ఉంచాను."

"ఓ ! థాంక్యూ పా!" శృతి పవన్‌ను ...

పవన్, శృతి భార్యాభర్తలుగా హనీమూన్‌కి కులూమనాలీ వెళ్ళారు. చంద్రుని తేనె జుర్రుకుని వచ్చి గృహస్థాశ్రమంలో స్థిరపడిపోయారు.

★ ★ ★

"మీ స్టాక్సు, రిసీవబుల్స్ కాకుండా, ఏదైనా స్థిరాస్తి కూడా సెక్యూరిటీగా కావాలని మా రీజనల్ ఆఫీసు నుండి లెటరొచ్చింది." తన ఛాంబర్‌లో అడుగు పెట్టిన సదానందంతో అన్నాడు బ్రాంచి మేనేజరు.

"దాందేముంది? మన మేడ ఇస్తాం. కాని అది మా నాన్నగారి పేరున ఉంది."

"పరవాలేదు. మీ కంపెనీలో ఆయనా డైరెక్టరేగా! మీ నాన్నగారి సమ్మతి ఉంటే చాలు. తనఖాకి సంబంధించిన దస్తావేజులో ఆయన సంతకం చేస్తారు గదా?" బ్రాంచి మేనేజరు అడిగాడు.

"ఒక్కగా నొక్క కొడుకుని, నా వ్యాపార వృద్ధికి ఆమాత్రం సహాయం చేయకపోరు మా నాన్న. మీకు కావలసిన దస్తావేజులు చెప్పండి. అవన్నీ రెండురోజుల్లో అందజేస్తాను."

'ఫ్యూచురా కంప్యూటర్ హార్డ్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్' కంపెనీకి బ్యాంకు లోనుమంజూరు చేశారు. ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం అట్టహాసంగా చేశారు. బ్యాంకు రీజనల్ మానేజర్ ముఖ్య అతిథిగా వచ్చారు. స్టార్ హోటల్లో బ్యాంకు అధికారులకు, ఇతర సిబ్బందికి మందు – విందు ఆర్భాటంగా ఏర్పాటు చేశాడు సదానందం. అతని వ్యాపార జీవితంలో మరో పర్వం మొదలైంది.

★ ★ ★

పవన్, శృతి సంసార జీవితం అప్పుడప్పుడు కొన్ని అపశృతులు పలికినా, మొత్తం మీద కొన్నేళ్ళు సాఫీగానే సాగింది. మూడేళ్ళ తేడాలో వారికో అబ్బాయీ – అమ్మాయీ పుట్టారు. ఆ తర్వాత 'ఎర్రత్రికోణం'! పవన్‌కు ఉద్యోగంలో ప్రమోషనొచ్చింది. వారి అబ్బాయి

స్కూలుకి వెళుతున్నాడు. ఇప్పుడు వారి జీవితంలో ఏ ప్రత్యేకతా లేదు. అందరిలా సగటు కుటుంబం వారిది.

★ ★ ★

నగరంలోని ప్రముఖ వ్యాపారవేత్తల్లో ఒకడిగా గుర్తింపబడ్డాడు సదానందం. అతని వ్యాపార పరిధి, చుట్టుప్రక్కల నగరాలకు పాకింది. కొన్ని బ్రాంచీలు తెరిచాడు. కొందరిని డీలర్లుగా నియమించాడు. ఇప్పుడతను రోజూ ఆఫీసుకు వెళ్ళడం లేదు. ఆ అవసరమూ లేదు. ఏ వారం రోజుల కొకసారో ఆఫీసుకు వెళ్ళి అమ్మకాల, కొనుగోళ్ళ వివరాలు చూస్తాడు చెక్కులపై సంతకాలు చాలా మట్టుకు ఇంట్లోనే చేస్తాడు. అవసరమైతే బకాయి వసూళ్ళకు ఫోన్లు చేస్తాడు. తన స్టాఫును పంపిస్తాడు.

సదానందం తన మకాం నగర శివార్లలోని తన సొంత బంగళాకి మార్చాడు. వ్యాపారాన్ని విస్తరింపజేయడానికి అతను తరచు క్యాంపులు వేస్తుంటాడు.

ఇప్పుడు బ్యాంకుక్కూడా అతను పోవాల్సిన అవసరం లేదు. అతని సిబ్బంది ఆ వ్యవహారాలన్నీ చూసుకుంటారు.

ఇప్పుడో కొత్త మానేజరు వచ్చాడు. అతని గాఢ మిత్రుడైన బ్రాంచి మేనేజరు ప్రమోషనుపై వేరే రాష్ట్రానికి బదిలీ అయ్యాడు. కొత్త మేనేజరుతో ముఖ పరిచయం తప్ప, అంత సాన్నిహిత్యం ఏర్పడలేదు సదానందానికి ఇప్పుడు తను మేనేజరు కంటే పై స్థాయిలో ఉన్నాడు. నాలుగుసార్లు ఫోను చేస్తే ఒకసారి లైన్లోకి వస్తాడు. టూకీగా మాట్లాడి ఫోను పెట్టేస్తాడు.

★ ★ ★

భర్తగా మారిన పవన్‌కు, ఇద్దరు పిల్లల తల్లిగా రూపొందిన శృతి పై మోజు తీరింది. ఆఫీసులో హోదాపెరగడంతో హోటళ్ళలో పార్టీలిచ్చే పార్టీలు పెరిగారు. క్లబ్బులో పేకాట అలవాటైంది. డిన్నరు రోజూ బయటే కానిస్తున్నాడు. రాత్రి పన్నెండుకులోపు అతను ఇంటికి చేరే దినాలు చాలా తక్కువ. ఇదంతా శృతికి బాధాకరంగా ఉంది. జీవితం సాఫీగా గడుస్తోంది గదా అని అబ్బాయి పుట్టిన తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసింది. ఇప్పుడు అసహాయురాలైంది.

పవన్ నిర్లక్ష్యం పెరిగింది. వారంలో రెండు మూడు రోజులు ఇంటికి రావడం కూడా మానేశాడు. వాళ్ళ ఆఫీసులోని స్టెనోతో సన్నిహితంగా ఉంటున్నాడని వినికిడి.

★ ★ ★

తన వ్యాపార సామ్రాజ్య విస్తరణపై దృష్టి కేంద్రీకరించిన సదానందం ఉన్న వ్యాపారం పై శ్రద్ధ చూపడం తగ్గించాడు. అతని ఉద్యోగులను అదుపులో ఉంచేవారు లేకపోయారు లెక్కల్లో అవక తవకలు ఎక్కువయ్యాయి. బ్యాంకు వడ్డీ బకాయి పడింది. లోను వాయిదాలు కూడా కట్టలేని పరిస్థితి ఏర్పడింది. బ్రాంచి మేనేజరు ఇరకాటంలో పడ్డాడు. పై ఆఫీసుల్లో, ఆఫీసర్లలో మంచి పరపతి ఉన్న మనిషి సదానందం. అతన్ని అగౌరవపరిస్తే తన సీటుకే మోసం రావచ్చు. అందుకని తన పరిధిలో ఓవర్‌డ్రాఫ్టులు అలౌ చేశాడు. సున్నితమైన

నోటీసులు పంపాడు. ఒక్కసారి ఖాతాలను ఫ్రీజ్ చేస్తే పరిస్థితి ఇంకా విషమించవచ్చు. సాధ్యమైనంత ఓర్పుతో సదానందం కంపెనీలకు ఆర్థిక సహాయం కొనసాగించాడు. బ్రాంచి మేనేజరు కాని రాను రాను పరిస్థితి విషమించసాగింది.

ఆ బ్యాంకులో ఇక తన పప్పులుడకవని సదానందం వేరే బ్యాంకులో ఇంకో పేరుతో ఖాతా తెరిచాడు. స్టాకులు, మెషీన్లు వేరే చోటికి తరలించి ఆ షాపు, ఫ్యాక్టరీ మూసి వేశాడు. తన భార్య పేర వేరే షాపు తెరిచాడు. ఓ పెద్ద ప్రాజెక్టు సన్నాహాల్లో ఉన్నాడు. దానికి లోన్లు మంజూరు చేయించడానికి ఓ కన్సల్టెంటును నియమించాడు.

చివరి ప్రయత్నంగా మేనేజరు సదానందానికి ఓ ఏ.సి.హోటల్లో మందు పార్టీ ఏర్పాటు చేశాడు. బ్యాంకుతో పేచీ మంచిది కాదని సముదాయించాడు. మొహమాటానికి మేనేజరు చెప్పిన వాటికి ।ఊc కొట్టాడు సదానందం. కాని మనసులో... 'సొసైటీలో మంచి పలుకుబడి ఉన్న తనను బ్యాంకు వాళ్ళు ఏం చేయగలరు? తను సెక్యూరిటీగా ఇచ్చిన అస్తులు అమ్మినా, బకాయి పడ్డ సొమ్ము సగం కూడా తీరరు. మిగతా సొమ్ము తనిస్తేనే కదా వాళ్లు తీసుకునేది?

బ్యాంకు లోన్లతో వచ్చిన డబ్బు పక్కదారి మళ్ళించి తన వాళ్ల పేరు మీద ఆస్తులు కూర్చుకున్నాడు తను. బ్యాంకు వాళ్లు కోర్టులో దావా వేసినా, కేసు పది సంవత్సరాల దాకా సాగదీయవచ్చు. ఆ తర్వాత కూడా తను చెల్లించే పరిస్థితిలో లేననీ, వాయిదాలపై తీరుస్తాననవచ్చు. వడ్డీ కాకుండా అసలుకు కూడా ఎగనామం పెట్టవచ్చు. కోర్టు ద్వారా రాయితీలు పొందవచ్చు. తనకు తెలిసిన వారు ఎందరు అలా చేయలేదు గనుక!'

సదానందం ఆలోచిస్తానని మేనేజరు దగ్గర సెలవు తీసుకున్నాడు. కాని తన మాట నిలుపుకోలేదు.

సదానందం బ్యాంకు ఎకౌంట్లు ఎస్.పి.ఎ గా (నాన్ పర్ఫార్మింగ్ అస్సెట్స్ - వడ్డీ కూడా రాని ఆస్తులు) పరిగణింపబడ్డాయి.

☆ ☆ ☆

" ఏమండీ ఇలా ఎన్ని రోజులు?" మూడు రోజుల తర్వాత క్రితం రాత్రి ఇంటికి వచ్చిన పవన్‌కు మర్నాడు ఉదయం టీ, టిఫిన్ ఇస్తూ అంది శృతి.

"ఏం ఇప్పుడేమైంది?"

"ఏమైందో. ఏమౌతోందో మీకు తెలియదా? మనం కలలు గన్న జీవితమిదేనా?"

"మన జీవితానికి కొచ్చిన లోటేమిటిప్పుడు? ఇల్లుంది. కారుంది ఇంట్లో అన్ని హంగులూ ఉన్నాయి. నీ కింకేం కావాలి?"

"ఇవన్ని ఉండగానే సరా? నా పట్ల. మన పిల్లల పట్ల ప్రేమ, ఆప్యాయత కొంతైనా మిగిలి ఉందా మీలో? పెళ్ళి కాక ముందటి మీ వాగ్దానాలు, పెళ్ళైన తర్వాత మూడు నాలుగేళ్ళ మన జీవితం జ్ఞప్తికి తెచ్చుకోండి" శృతి కళ్ళలో నీళ్ళు.

"అప్పటి నా హోదాకీ, ఇప్పటి నా పొజిషన్‌కి తేడా లేదూ? ప్రమోషన్లొచ్చి, బాధ్యతలు పెరిగిన తర్వాత ఖచ్చితమైన వర్కింగ్ అవర్స్ అంటూ ఉండవు. జీవితంలో ఇంకా

పైకెదగడానికి నిరంతరం శ్రమ పడాల్సిందే. మునుపటిలా ఆరు గంటలకే ఇంట్లో ఉండాలంటే కుదురుతుందా"?

"రాత్రి పన్నెండు దాకా మీ ఉద్యోగ బాధ్యతల్లోనే ఉంటున్నారా?"

"కాక"

"నా నోటితోనే చెప్పించాలని చూస్తున్నారా?"

"ఏమిటి నువ్వు చెప్పేది? మగాడన్న తర్వాత సవాలక్ష పనులుంటాయి. వాటన్నిటినీ నీ ముందు ఏకరువు పెట్టే అవసరం నాకు లేదు. నీకు, నీ పిల్లలకు ఏదైనా లోటుచేస్తే అప్పుడడుగు. అంతేగాని నీకు అవసరం గాని విషయాలపై రాద్ధాంతం చేయకు" అని విస విసా బయటికెళ్ళాడు పవన్.

'నా పిల్లలా? ఆయనకు మాత్రం పిల్లలు కారా' నోరు తెరిచి నిస్సహాయంగా నిలుచుంది శృతి.

☆ ☆ ☆

బ్యాంకు సదానందంపై, అతని కంపెనీపై దావా వేసింది. మంచి లాయరును పెట్టాడు సదానందం.

ప్రభుత్వ రంగంలోని ఆ బ్యాంకు సిబ్బంది వాళ్ళ జీతాలు, సౌకర్యాలు, పెంచమని సమ్మెలు చేయడంలో ఉన్న శ్రద్ధ, బ్యాంకు ఋణాలు వసూలు చేయడంలో ఉండదుకదా! కేసు వాయిదాల చుట్టూ తిరుగుతోంది. సదానందం కుటుంబ సభ్యులు డైరెక్టర్లుగా ఓ కొత్త కంపెనీ పెద్ద ఎత్తుగా ఏర్పడింది. దానికి మరో బ్యాంకు భారీ లోను మంజూరు చేసింది. ఇప్పుడు సదానందం వారి విలువైన క్లైంట్. మరోచరిత్ర మొదలైంది.

☆ ☆ ☆

పవన్ ప్రవర్తనలో మార్పు రాకపోగా పరిస్థితి మరీ విషమించింది. ఇప్పుడతను శృతిని, పిల్లలను అస్సలు ఖాతరు చేయడం లేదు. ఏ వారం రోజులకొకసారో వస్తే వచ్చినట్లు, లేకపోతే లేదు. ఇక్కడ శృతి ఏడ్పులు, ఎక్కిళ్ళు తప్ప అతనికి ఏమి మిగిలి ఉంది గనక!

అతనికి తన స్టెనో సాన్నిధ్యమే స్వర్గంగా ఉంది. శృతి ఇక ఊరుకోలేక పోయింది. పిల్లలతో తన పుట్టిల్లు చేరింది. అది పవన్ పట్ల వరమైంది. అతని అడ్డు తొలగింది. కోరుకున్న స్వాతంత్ర్యం లభించింది. కట్టె విరగకుండా పాము చావడంతో తన స్టెనోతో తన సొంత ఇంట్లోనే కాపురం పెట్టాడు పవన్ బాహాటంగా.

శృతి అన్యమనస్కంగా ఉన్నా వాళ్ళ నాన్న మాత్రం ఊరుకోలేక పోయాడు. పవన్‌ని కోర్టు కీడ్చాడు. పవన్‌కి కూడా విడాకుల అవసరం ఉండడం వల్ల కొద్దిపాటి భరణం పారెయడానికి పెద్ద కష్టమనిపించలేదతనికి కోర్టు విడాకులు మంజూరు చేసింది.

పవన్ – శృతి బంధం అధికారికంగా కూడా తెగింది. ఇక పవన్ – స్టెనోల మురిపెం ఎన్నాళ్ళో!

## ముగింపు:

ఒక వైపు కేసు నడుస్తున్నా బ్యాంకు వాళ్ళు సదానందంతో సంప్రదింపులు మొదలెట్టారు. వాళ్ళు కేసు వాపసు తీసుకుంటే ఏదోకాడికి సెటిల్ చేయడానికి తాను సిద్ధమని సదానందం తెలియపర్చాడు. కేసు సాగదీసి లాయర్ల జేబులు నింపడం కన్నా ఎవో కొన్ని రాయితీలిస్తే బ్యాంకు డబ్బు వసూలౌతుంది. అది ఇంకొకరి కిచ్చి వడ్డీ పొందవచ్చని బ్యాంకు వాళ్ళనుకుంటే, బ్యాంకు నుండి చాలామొత్తం రాయితీలు పొంది తన ఆస్తులు విడిపించుకుని కేసు ద్వారా తన పేరుకు వచ్చిన మచ్చని తొలగించుకోవచ్చని సదానందం ఎత్తు. తన పరపతి, పైరవీలుపయోగించి... బకాయిపడ్డ అసలు మొత్తంలో కూడా సదానందం మినహాయింపు పొందాడు. కొంత డబ్బు అధికారుల చేతులు మారింది. కోర్టులో సమ్మతిపత్రం దాఖలు చేయబడింది. ఒప్పందం ప్రకారం సదానందం డబ్బు కట్టాడు. దానికి వేరే బ్యాంకు నుండి అప్పు తీసుకున్నాడు. అది వేరే సంగతి. మొత్తం మీద సదానందం కేసు పీడ వదిలించుకున్నాడు.

ఆ బ్యాంకుతో అతని సంబంధానికి మంగళం పాడాడు. ఇక ఇంకో బ్యాంకుతో అతని హనీమూన్ ఎన్నాళ్ళో!

ఇంకో ముగింపు:

సహనం, నేర్పరితనం, నైపుణ్యం తగు పాళ్ళలో ఉన్న భార్య, తన భర్తను అదుపులో పెట్టగలుగుతుంది. ఆమె అవసరాన్ని బట్టి ప్రేమతో అలరిస్తుంది. అలిగి సాధిస్తుంది. మరీ తప్పనప్పుడు కోపం ప్రదర్శిస్తుంది. మన వివాహవ్యవస్థ పటిష్టమైనది.

సంసారంలో ఎన్ని కలతలున్నా అవన్నీ సహిస్తూ, భరిస్తూ, అసంతృప్తితోనైనా దాంపత్యజీవితం కొనసాగుతుంది. బహు కొద్ది జంటలు తాడును తెగే దాకా సాగదీస్తారు.

డిపాజిట్లు, లోన్లు, కూడికలు, తీసివేతలు వీటన్నిటితో కూడిన బ్యాంకింగులో కూడా ప్రేమ కోణం ఉంది. సహనం, నేర్పరితనం నైపుణ్యం ఇక్కడా అవసరమే. మేనేజరు విజయవంతం కావాలంటే ఇవి అలవర్చుకొవాలి. ఎప్పుడేది అవసరమో అది ఉపయోగించే విజ్ఞత ఉండాలి. లేకపోతే సదానందం లాంటి భర్తలు మోసం చేయడానికి ఆస్కారం ఉంది. సాధారణంగా అందరూ మంచి భర్తలే! (పై పై చూపులకైనా) భార్యా విధేయులే! అయితే పరిస్థితులు సానుకూలపడితే అడ్డదారి తొక్కే ప్రమాదం ఉంది. అప్పుడే పవన్‌లూ, సదానందాలూ తయారవుతారు.

మరో ముగింపు: భరత వాక్యం - చూశారా! అరుదుగానైనా తరచూ తారసపడే సంసార జీవిత పర్యావసానం! మన వివాహ వ్యవస్థలోని ఒక పార్శ్వం! నిస్సారమైన కూడికలూ, తీసివేతలతో కూడిన బ్యాంకింగ్ వ్యవస్థకూ వివాహవ్యవస్థకూ ఉన్న స్సామ్యం!

బ్యాంక్ పని సానుకూలతకు కంప్యూటర్ ప్రొగ్రాములున్నాయి. పవన్- సదానందం లాంటి వాళ్ళతో వేగడానికి కూడా ఓ సాఫ్ట్‌వేర్ ఉంటే? ఈ విషయంలో మీరేమైనా సహాయం చేయగలరా?...

'రచన' మాసపత్రిక ఫిబ్రవరి **1999**